క్లుప్తంగా

జీపీలకు నూతన భవనాలు

రుద్రూర్: రుద్రూర్, మోస్రా, చందూర్ మండలాల్లోని మూడు గ్రామ పంచాయతీ కార్యాలయాల కోసం నూతన భవనాలు మంజూరు కావడంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేశారు. రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్, మోస్రా మండలం తిమ్మాపూర్, చందూర్ మండలం కారేగాం తండా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ఒక్కొక్క జీపీకి రూ.20 లక్షలు మంజూరైనట్లు సర్పంచ్‌లు ఖాదర్, సున్నం భూమయ్య, దేవిసింగ్ వెల్లడించారు.

బాలికలకు కరాటే శిక్షణ

బోధన్: బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల నియంత్రణ, ఆపద సమయంలో ఆత్మ రక్షణే లక్ష్యంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బాలికలకు కరాటే శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కనీసం మూడేళ్ల శిక్షణ అనుభవం ఉన్న మాస్టర్లను ఎంపిక చేసింది. కరాటే మాస్టర్లకు నెలసరి గౌరవ వేతనం చెల్లించనుంది. ఇందుకు ఎంపికైన బోధన్‌కు చెందిన ఒకినోవా కరాటే శిక్షణ సంస్థ మాస్టర్ అశోక్ రోడే మంగళవారం పట్టణ కేంద్రంలోని బీటీనగర్ జీహెచ్‌ఎస్, రాకాసీపేట్ జీహెచ్‌ఎస్(జేసీ)ల్లో బాలికలకు కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు ఉంటుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

రెంజల్ హైస్కూల్లో..

రెంజల్(బోధన్): బాలికలు ఆత్మరక్షణ కోసం, అఘాయిత్యాల నుంచి కాపాడుకునేందుకు ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నెల రోజుల పాటు కరాటే శిక్షణ అందిస్తున్నట్లు ఎంఈవో గణేశ్‌రావ్ తెలిపారు. రెంజల్, దూపల్లి, వీరన్న గుట్ట, సాటాపూర్ గ్రామాల్లో మంగళవారం శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు వివరించారు. మిగిలిన పాఠశాల్లో శిక్షణ అందించే ట్రైనర్‌లు లభించగానే ప్రారంభిస్తామన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రెంజల్(బోధన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని అధికారులు సూచించారు. వీరన్నగుట్ట జీపీలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాంచందర్, ఎస్సై పండ్ల సాయన్నలు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అఘాయిత్యాలను గుర్తించి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకునేందుకు ప్రతీ నెల పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామాల్లో అసమానతలను దూరం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో శంకర్, ఎంఈవో గణేశ్‌రావ్, ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కుక్కల బెడద అరికట్టండి

రుద్రూర్: మోస్రా మండలం తిమ్మాపూర్‌లో పిచ్చి కుక్కల బెడద ఎక్కువైంది. పిచ్చికుక్కలు తిమ్మాపూర్‌తో పాటు సమీపంలో గ్రామాల్లోకి వెళ్లి దాడి చేస్తున్నాయని స్థానికులు వాపోయారు. ఇప్పటి వరకు ఆరుగురికి కరవగా స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

కోటగిరి : పోతంగల్ మండలం హంగర్గాలో నివసించే కంచె జీవన్ అదే గ్రామ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా ఉంటూ ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మంచం పట్టాడు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్న ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఆ పాఠశాల టీచర్లలో మానవత్వం వెల్లివిరిసింది. హెడ్ మాస్టర్ వెంకట్ రమణ ఆధ్వర్యంలో ఆదుకోవాలని సంకల్పించారు. రెండ్రోజుల్లోనే పీఆర్టీయూ ప్రతినిధులు, వివేకానంద యూత్, ఛత్రపతి శివాజి యూత్ సభ్యులు, అయ్యప్ప సేవా సమితి సభ్యులు, ఆర్‌ఎంపీ సితాలె రమేష్, ఇతర మిత్ర బృందం, టీచర్లు శ్రమించి రూ. లక్షా 7 వేల 469 సేకరించి ఆయన తల్లికి నగదును అందించారు. ఉపాధ్యాయ బృందం, దాతలకు జీవన్ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

పోటీ పరీక్షల్లో నెగ్గితేనే అధ్యాపకుల కృషికి ప్రతిఫలం

కోటగిరి : కోటగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి ఇటీవల ఐఎస్‌వో గుర్తింపు లభించడంతో కాలేజీ ప్రతిష్ట పెరిగిందని, భవిష్యత్తులో జేఈఈ, నీట్ పరీక్షల్లో నెగ్గితే ప్రభుత్వం చేస్తున్న కృషి, లెక్చరర్ల శ్రమకు ఫలితం దక్కుతుందని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు విద్యాధికారి(డీఐఈవో) రఘురాజ్ పేర్కొన్నారు. మంగళవారం కోటగిరి గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ డే, స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి

వర్ని: విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని డీఐఈవో రఘురాజు సూచించారు. వర్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. రఘురాజు మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. ప్రిన్సిపల్ రవికుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్యానికి పెద్ద పీట

- ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత
- సర్వసభ్య సమావేశంలో 30 ఎజెండా అంశాలకు ఆమోదం



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పండిత్ వినీత


ఆర్మూర్ పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ కౌన్సిలర్లు, నేతలు

ఆర్మూర్: పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుధ్య కార్యక్రమాలకు పెద్ద పీట వేస్తామని ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశపు గదిలో మున్సిపల్ సాధారణ సర్వ సభ్య సమావేశం చైర్ పర్సన్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 30 అంశాలపై పాలకవర్గం చర్చించి తీర్మానాలు చేశారు. అనంతరం చైర్ పర్సన్ కౌన్సిలర్లనుద్దేశించి మాట్లాడుతూ.. కాలనీల్లో పందులు, కోతులు, కుక్కలను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మనోహర్, వైస్ చైర్మన్ షేక్ మున్ను, టీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరిపించాలి

ఆర్మూర్ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై కలెక్టర్ వెంటనే స్పందించి ప్రత్యేక అధికారితో విచారణ జరిపించాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం అనంతరం బీజేపీ కౌన్సిలర్లు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నిరసన తెలిపిన వారిలో బీజేపీ కౌన్సిలర్లు, నేతలు సాయి, మురళి ఉన్నారు.

12 ఎజెండా అంశాలు ఆమోదం


మాట్లాడుతున్న తూము పద్మాశరత్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో 12 ఎజెండా అంశాలు ఆమోదం పొందాయి. మంగళవారం బోధన్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో 13 ఎజెండా అంశాలు పొందు పరచగా సభ్యులు 12 అంశాలకు ఆమోదం తెలిపారని చైర్ పర్సన్ తెలిపారు. ఎజెండాలో ఒక అంశం ఆమోదం పొందలేదన్నారు. సమావేశంలో కమిషనర్ ఖమర్ హైమద్, వివిధ పార్టీల ఫ్లోర్ లీడర్లు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ముస్తాబైన ప్రభుత్వ పాఠశాలలు


బోధన్‌లోని తీర్‌గల్లీ ప్రభుత్వ పాఠశాల

బోధన్‌టౌన్(బోధన్): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధన చేయాలన్న ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ముస్తాబయ్యాయి. ఇందులో భాగంగానే బోధన్ మున్సిపాలిటీ పరిధిలో 15 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో కావాల్సిన వసతుల కల్పన, మరమ్మతులు, ప్రహరీల నిర్మాణాలకు అంచనాలు వేసి నిధులను కేటాయించారు. రూ.30 లక్షల లోపు నిధులు కేటాయించిన పాఠశాలలకు నామినేషన్ ద్వారా కాంట్రాక్టర్‌లకు పనులు కేటాయించారు. ఎక్కువ నిధులు ఉన్న పాఠశాలలకు టెండర్ ప్రక్రియను రూపొందించారు. 15 పాఠశాలకు గాను 10 పాఠశాలల్లో పనులను ప్రారంభించగా 5 పాఠశాలల్లో ఇప్పటి వరకు పనులు పూర్తి చేశారు. మిగితా 5 పాఠశాల్లో పనులు కొనసాగుతున్నాయి. మిగితా 5 పాఠశాలలకు టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది.

పనులు పూర్తయిన పాఠశాలలు..

పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలకు రూ.10 లక్షల 15 వేలు, తీర్‌గల్లీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.20 లక్షల 80 వేలు, శక్కర్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలకు రూ.7 లక్షల 50 వేలు, పాండుఫారంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.10 లక్షల 15 వేలు, బీటీనగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలకు రూ.6 లక్షల 30 వేలు కేటాయించారు. ఒక్కో పాఠశాలకు కేటాయించిన నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పాఠశాల ఆవరణను సుందరంగా తీర్చిదిద్దారు. పనులను విద్యాశాఖ అధికారులతో పాటు, మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, కమిషనర్ ఖమర్ హైమద్ పర్యవేక్షిస్తూ కాంట్రాక్టర్‌లకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి



రెంజల్(బోధన్): మన ఊరు– మన బడి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి రాములు సూచించారు. మండలంలోని బోర్గాం, సాటాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను సకాలంలో పూర్తి చేయించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనులు వెనుకబడటానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో శంకర్, ఏఈ లిఖిత ఉన్నారు.

కొనసాగుతున్న 'జిల్లా' దీక్షలు



బోధన్: ప్రత్యేక జిల్లా డిమాండ్‌తో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 44వ రోజుకు చేరాయి. న్యాయవాదుల పోరాటానికి బిల్డింగ్ పెయింటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు కనకరాజు, షేక్ ఇస్మాయిల్, సంజీవ్, హసన్ బేగ్, వెంకట్, వెంకటరమణ, ఎండీ ఖదీర్ పాషా, అజ్మత్ ఖాన్, గోపిసింగ్, విజయ్, నజీర్, మహేష్, కలీం, రఘు, మోహిజ్, జావిద్, రిజ్వాన్‌లు మద్దతు తెలిపి దీక్షలో కూర్చున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగారెడ్డి, న్యాయవాదులు హన్మంత్‌రావు, అడ్లూరి శ్రీనివాస్, బానోత్ రమేష్‌లు దీక్షలను ప్రారంభించారు. బీఎస్పీ నియోజకవర్గ నేత పాండు, న్యాయవాదులు చైతన్య, అర్జున్ రండార్, శంకర్ నాయక్ సాయిలు, గిరిధర్‌రాజ్, విద్యార్థి జేఏసీ ప్రతినిధి శివకుమార్ పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌పై అవగాహన



భీమ్‌గల్: సికింద్రాపూర్‌లో సౌర విద్యుత్‌పై మహిళా సంఘ సభ్యులకు మంగళవారం స్త్రీనిధి ఆర్‌ఎం రామ్‌దాస్, ఐకేపీ ఏపీఎం కుంట శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోలార్ యూనిట్ ఏర్పాటుకు స్లాబ్ ఇల్లు విస్తీర్ణం 160 నుండి 200 చదరపు అడుగులు ఉండాలని అన్నారు. 2, 3 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ యూనిట్ ఏర్పాటుకు రూ.1,42,200లు ఖర్చు అవ్వగా, రూ.39,200 సబ్సిడీ పోను, స్త్రీనిధి ద్వారా రూ.లక్ష రుణం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు



ఆర్మూర్: విద్యార్థులు కష్టపడుతూ కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యా హైస్కూల్ డైరెక్టర్లు ప్రవీణ్ పవార్, గోపికృష్ణ సూచించారు. పట్టణంలోని ప్లాజా గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో విద్యా హైస్కూల్ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో వీక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సాత్‌పుతే శ్రీనివాస్, లోటస్ పాఠశాల ప్రిన్సిపాల్ అంబికా పవార్, ఇన్‌చార్జి వరంగంటి లావణ్య పాల్గొన్నారు.

సమస్యలపై చర్చించాలని వినతి



ఆర్మూర్: బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై చర్చ జరపడంతో పాటు నిధుల కేటాయింపును పెంచేలా ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ చర్యలు చేపట్టాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇన్‌చార్జికి తమ డిమాండ్లను తెలియపరుస్తూ వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఆర్మూర్ అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, నాయకులు గోదావరి, లక్ష్మి, జగదాంబ తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి



మాక్లూర్: వ్యవసాయ పొలాలకు వెళ్లే ప్రధాన రహదారిని ఒకరు కబ్జాచేసి ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని, ఈ అక్రమ కట్టడాన్ని వెంటనే నిలిపేయాలని కోరుతూ మంగళవారం సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. మాణిక్‌భండార్ శివారులోని భీమ్ చెరువు సమీపంలో రహదారి ఉంది. సుమారు రైతులు ఈ రహదారి ద్వారానే రాకపోకలు సాగిస్తారు. వ్యవసాయ పనులకు ఉపయోగించే హార్వెస్టర్, ట్రాక్టర్ వెళ్లాలన్నా రైతులకు ఈ రహదారే దిక్కు. అలాంటి రహదారిని సమీపంలో ఉన్న ఓ భూమి యజమాని తన పరిధిని దాటి కబ్జా చేస్తూ ప్రహరి గోడ నిర్మాణం చేపట్టారు. ఈ విషయమై స్థానిక రైతులు అడ్డుచెప్పినా వినటం లేదని తహసీల్దార్ శంకర్‌కు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

'ప్రజల వద్దకు ఆర్టీసీ'

వేల్పూర్: లక్కోరలో మంగళవారం ఆర్మూర్ డిపో ఆర్టీసీ అధికారులు ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజలకు అన్ని వేళల్లో బస్సులను నడుపుతున్నామని చెప్పారు. విద్యార్థులు, దివ్యాంగులకు బస్‌పాస్‌లలో రాయితీ కల్పిస్తున్నామని, తిరుమల, తిరుపతి దేవస్థానం దర్శించడానికి బస్సుల్లో ప్రయాణించే వారికి దర్శనం టికెట్లను ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఆర్టీసీలో ప్రారంభించిన కార్గో సేవలతో దూర ప్రాంతాలకు సైతం వస్తువులను చేరవేయడం, దిగుమతి చేసుకునే సౌకర్యం ఏర్పడిందన్నారు. సర్పంచ్ వంశీకృష్ణ, ఉపసర్పంచ్ నాగమణి, వీడీసీ అధ్యక్షుడు సుదర్శన్, డిపో ఎస్టీ పారు పాల్గొన్నారు.



విగ్రహం తొలగించిన వారిపై చర్యలకు డిమాండ్


మోర్తాడ్‌లో రాస్తారోకో చేస్తున్న గౌడ సంఘం సభ్యులు

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్‌లో ప్రతిష్ఠాపనకు సిద్ధంగా ఉన్న సర్వాయి సర్దార్ పాపన్న విగ్రహాన్ని తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సర్వాయి పాపన్న విగ్రహాంను ఆవిష్కరించాల్సి ఉండగా అంతలోనే మున్నూరుకాపు సంఘం సభ్యులు తొలగించి గ్రామ పంచాయతీలో పెట్టారని గౌడ సంఘం సభ్యులు ఆరోపించారు. దోషులపై క్రిమినల్ కేసులను నమోదు చేసి మళ్లీ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న గౌడ సంఘం సభ్యులతో అధికారులు, పోలీసులు చర్చలు జరిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని వారి హామీ ఇచ్చారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి


వెంచిర్యాల్‌లో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రాజుకుమార్, రైతులు

బాల్కొండ/వేల్పూర్/మాక్లూర్: వరి పంటలో వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ముప్కాల్, వేల్పూర్, మాక్లూర్ మండలాల వ్యవసాయ శాఖాధికారులు రాజు కుమార్, నర్సయ్య, పద్మ అన్నారు. మంగళవారం బాల్కొండ మండలం వెంచిర్యాల్‌లో రాజుకుమార్, వేల్పూర్ మండలం పడగల్‌లో నర్సయ్య, మాక్లూర్ మండలం ఒడ్డెట్‌పల్లి, బోర్గాం(కె), కృష్ణనగర్ గ్రామాల్లో పద్మ పర్యటించి వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు. రైతులు వరిలో మోతాదుకు మించి యూరియా వాడవద్దన్నారు. ఎదుగుదల లేకపోతే వెంటనే జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటికి 2 గ్రాములు కలిపి ఎకరానికి 200 లీటర్ల నీటిని పిచికారీ చేయాలన్నారు. వరి నాట్లు వేసిన 15 నుంచి 20 రోజుల వ్యవధిలోనే మొగి పురుగు నివారణ కోసం 3జీ కార్బోఫ్యూరాన్ గుళికలు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను ఎకరానికి 8 కిలోలు చల్లాలన్నారు.

అగ్గితెగులు నివారణకు..

వరిలో అగ్గితెగులు నివారణకు ఐసోప్రొథియోలేన్ 300 మిల్లీలీటర్లు, లేదా టిబుకోనజోల్ 300 మి.లీ. ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. మరీ ఎక్కువగా ఉంటే ట్రైసైక్లోజోల్ 400 మిల్లీలీటర్లు పిచికారీ చేసుకోవాలని చెప్పారు. పిచికారి చేసే ముందు పొలంలో ఉన్న నీరు తీసేయాలన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణకు..

కాండం తొలుచు పురుగు వ్యాపించి వరిలో ఎదుగుదల కన్పించటం లేదని వ్యవసాయ అధికారి పద్మ విచారం వ్యక్తం చేశారు. రైతులు నాటు వేసిన 15 నుంచి 20 రోజుల మధ్యలో కచ్చితంగా 3జీ గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున వాడితే కాండం తొలుచు పురుగు రాదన్నారు.

స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయండి

- సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్


మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకటేష్

ఆర్మూర్: ఆర్మూర్, జక్రాన్‌పల్లి మోడల్ కళాశాలల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను వెంటనే మంజూరు చేయాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కళాశాల విద్యార్థులకు ఏడేళ్లుగా స్కాలర్‌షిప్‌లు అందకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా టెక్నికల్ సమస్య కారణంగా మంజూరు కావడం లేదని సమాధానం చెబుతూ చేతులు దులుపుకుంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ రెండు మోడల్ కళాశాలల్లోనే ఈ సమస్య ఉందని ఆయన పేర్కొన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. నాయకులు భూమన్న, సాకలి రాజన్న, పల్లపు అంజయ్య, చిన్నయ్య, జవహర్ సింగ్ పాల్గొన్నారు.

నందిపేట పరువు తీశారు


మాట్లాడుతున్న ఉప సర్పంచ్ మాధ రవి

నందిపేట్(ఆర్మూర్): నిధుల దుర్వినియోగంపై సస్పెన్షన్‌కు గురైన సర్పంచ్ సంబారు వాణి తప్పుడు ఆరోపణలు చేస్తూ నందిపేట పరువు తీస్తోందని ఉప సర్పంచ్ మాధ రవి అన్నారు. నందిపేటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. అధికారుల సూచన మేరకు గ్రామాభివృద్ధి దృష్ట్యా ఇప్పటి వరకు రూ.52 లక్షల విలువైన చెక్కులపైన సంతకాలు చేశానని, నన్ను గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎక్కడ పడితే అక్కడ సంతకాలు పెట్టడం కుదరదని చెప్పడం వల్లే తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. కులరాజకీయాలతో బురద చల్లే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయం ముందు ఆత్మహత్యాయత్నం చేయడం సిగ్గు చేటని, గ్రామ సభ ఏర్పాటు చేసి మాట్లాడితే నిజస్వరూపం తెలుస్తుందన్నారు.


నందిపేటలో మాట్లాడుతున్న సుధాకర్

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

నందిపేట్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నందిపేట సర్పంచు సంబారు వాణిని కలిసి ధైర్యం తెలిపారు. సుధాకర్ మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు చెల్లించక పోవడం వల్ల మానసికంగా ఇబ్బందులకు గురై కొంత మంది సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. సీపీఐ నాయకులు ఓమయ్య, ఆనందం ఉన్నారు.

కిరణ్ కుమార్ స్ఫూర్తితో ఉద్యమించాలి

మాక్లూర్: కామ్రేడ్ కిరణ్ కుమార్ ఉద్యమ స్ఫూర్తితో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు దేశెట్టి సాయిరెడ్డి యువతకు పిలుపునిచ్చారు. మంగళవారం బోర్గాం(కె)లో జరిగిన కిరణ్ కుమార్ 32వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గుట్కాకు వ్యతిరేకంగా మొట్ట మొదటి ఉద్యమం కూడా ఇక్కడి నుంచే ప్రారంభించి, రాష్ట్ర స్థాయి వరకు తీసుకెళ్లిన ఘనత కిరణ్‌కుమార్‌కే దక్కుతుందన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నందిపేటలో స్మారక పోటీలు

నందిపేట్(ఆర్మూర్): కిరణ్ కుమార్ వర్ధంతి సందర్భంగా నందిపేట మండల కేంద్రంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వాలీబాల్ పోటిలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. నాయకులుగంగాధర్, చుక్కబొట్ల దేవన్న పాల్గొన్నారు.

సిద్ద సాయరెడ్డికి ఘన నివాళులు

బోధన్: లంగ్డాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ చరిత్ర పరిశోధకుడు సిద్ద సాయరెడ్డి ఇటీవల తుది శ్వాస విడిచిన విషయం తెలిసిందే. మంగళవారం పట్టణ కేంద్రంలోని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ బోధన్ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో యూనియన్ ఆఫీసులో మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పెన్షనర్ల సమస్యలపై చర్చించారు.


బోర్గాం(కె)లో నినాదాలు చేస్తున్న నేతలు


బోధన్‌లో మౌనం పాటిస్తున్న అసోసియేషన్ సభ్యులు